# విలువలు

ఆరోజు....

నాకు ఇప్పటికీ గుర్తు ఉంది.

నా చెంపమీద గట్టిగా కొట్టారు. నామీద చేయి చేసుకోవటం అదే మొదటిసారి. నా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. చెంప తడుము కున్నాను. మీ చేతి వేళ్ళు పొంగుతున్నాయి.

"చెప్పానా నీకు, గుమ్మం దగ్గర నుంచోవద్దని!" అన్నారు.

అప్పటివరకు నేనింట్లోనే ఉన్నాను. నిజం. మీరు ఆఫీసు నుండి వచ్చేవేళ అయింది. మీరు రాగానే మీ కిద్దామని కాఫీ కాచాను. ఎంతసేపటికీ రారు. బయట సైకిల్ బెల్ మోగింది. మీరనుకుని బయటకు వచ్చాను. మీరు కాదు. ఎవరో. తిరిగి ఇంట్లోకి రాబోతోంటే సైకిలు మీద వస్తూ సందు చివర మలుపులో మీరు కనిపించారు. మిమ్మల్ని చూస్తూ నిలుచున్నాను. నామీద మీకు అనుమానం. నా మాటల మీద నమ్మకం లేదు. చెప్పినా నమ్మరు. చెప్పి లాభం ఏమిటి?

నేనెంతసేపటికీ మాట్లాడలేదు.

నా జుట్టు పట్టుకుని తల గోడకేసి కొట్టరు. తల పగిలి పోయిందనుకున్నాను. దిమ్మగా అయింది. రక్తం కారుతుందేమో అనుకుని తడుముకుంటే బొప్పి కట్టి ఉంది. కళ్ళల్లో నీరు నిలవటం లేదు.

"చెప్పు" అన్నారు.

చెప్పాను. మీరు నమ్మరని నాకు తెలిసినా చెప్పాను.

గుప్పిటతో నా ముక్కు మీద కొట్టేసరికి రక్తం బొటబొట కారసాగింది. రక్తం అంటే మీకు భయం అనుకుంటాను. నామీద దయ కలిగిందనుకోను. నా జుట్టు వదిలారు. నా కళ్ళు తిరుగుతోంటే నిలబడలేక కూలిపోయాను.

మీకు గుర్తుందా ఆ సంఘటన? ఉండకపోవచ్చు. ఆ తర్వాత నన్నెన్ని సార్లు కొట్టారో, బెల్టుతో నా వీపు వాచిపోయేలా, ఆ బకిల్ అచ్చులు నా శరీరం మీద తట్టులు తేలేలాగ... ఇవన్నీ మీకెందుకు గుర్తుండాలి?

మన పెళ్ళి అయిన కొత్తలో మన సంసారం గురించి నేనెన్ని కలలు కన్నాను! ఆ అందమయిన కలలన్నీ ఏమయినాయి? నేను అనుకున్నవి అనుకున్నట్లుగా ఎప్పుడూ జరగలేదు. మీ ప్రేమలో, లాలనలో, ముద్దులలో కరిగిపోదామని ఎంత ఆశించాను? ఆడదాన్ని. ఈ విషయాలన్నీ ఎలా చెప్పగలను?

నేను పూలు పెట్టుకుంటే సహించలేపోయేవారు. నేనంటే కోపమో, పూలంటే అయిష్టమో నాకు అర్థమయ్యేది కాదు. పెట్టుకున్న పూలు తీసి దండ పీకేసి బయటకు విసిరేసేవరకు ఊరుకునేవారు కాదు. పూలు పెట్టుకోవటం తప్పా? పూలంటే ఇష్టపడని ఆడవాళ్ళుంటారా? నా అలంకరణ మీ కోసం అంటే అర్థం చేసుకునే మనుషులా మీరు? మన పెళ్ళయి మూడు సంవత్సరాలు నిండాయి. ఈ మధ్యలో ఎప్పుడయినా నా దగ్గిర కూర్చుని మనసు విప్పి మాట్లాడిన రోజులు వదిలేయండి, గంటలూ నిమిషాలు కాదు, క్షణం ఉందా? నన్ను అర్థం చేసుకోవటానికి ప్రయత్నించారా? నామాటకు ఎప్పుడయినా విలువనిచ్చి మన్నించారా? రవంత ప్రేమ పంచి ఇచ్చారా? లేదు. మీ ఇష్టాయిష్టాలకు అనుగుణంగా మారే యంత్రంగానే చూశారు. నాకు హృదయం ఉందని, వ్యక్తిత్వం ఉందని ఎప్పుడూ అనుకుని ఉండరు. అందంగా కనిపించే మీ ముఖం వెనకాల శిల ఉందని, మీరు నా ఎడల క్రూరంగా ప్రవర్తిస్తుంటారని మా అమ్మకు చెప్పాను. నాన్నతో అన్నాను. అమ్మ కన్నీళ్ళు పెట్టుకుంది. 'నేను మీ ఆయన్ని నిలదీసి అడగొచ్చు. దీంతో మీ సంసారం ఒక కొలిక్కి వస్తుందంటావా? అడిగినందుకు పెళుసయి విరిగిపోతే?' అడిగాడు నాన్న. నా సమస్యలు నావి. నేనొకరికి సమస్య కాకూడదు. నాకు అర్థం అయిందది. చదువుకుని ఉంటే ఎంత బావుండేది?

ఒకసారి వేడి వేడి కాఫీ ఇచ్చానని గ్లాసు నా ముఖం మీద గిరాటువేసి నాచేయి పట్టుకుని మెలితిప్పి వీపు మీద గట్టిగా గుద్ది ముందుకో తోపు తోశారు. ఆ విసురుకు బల్లమీద పడ్డప్పుడు చీరంతా రక్తం. గర్భస్రావం అయింది. రాంబాబు నన్ను తీసుకెళ్ళి ఆస్పత్రిలో చేర్పించాడు. గర్భసంచికి దెబ్బ తగిలిందని తొలగించారు. తిరిగి ఇంటికి వచ్చి మామూలు మనిషినయాక కనీసం రోజుకొకసారయినా 'మళ్ళీ పెళ్ళిచేసుకుంటాను నిన్నొదిలి' అనేవారు. నాలాగా మరొకరు అన్యాయం ఎందుకు కావాలి?

నేను ఒక నిశ్చయానికి రావటానికి సమయం పట్టింది. ఎప్పటికయినా మీరు మారరా అనుకునేదాన్ని. ఎంత అపోహపడ్డాను! ఆ రోజు మీ అక్కగారు, అమ్మగారు, వీళ్ళతో పాటు ఇద్దరో ముగ్గురు మీ బంధువులు కూడా ఉన్నారు ఇంట్లో. పక్కింటి చిన్న పాప తప్పటడుగులు వేస్తూ నడుస్తోంటే నేనూ మీ అక్క కిటికీలోంచి పాపను చూస్తోంటే

మీరు వచ్చారు. "ఏమిటి చూస్తున్నావు?" అడిగారు. మీ అక్క ఆ పాపని చూపించింది. అయితే మీ చూపంతా రాంబాబు మీద ఉంది. అతన్ని నేనూ గమనించలేదు. "ఆ వంక పెట్టుకుని ఎవరినో చూస్తే ఎలా?" అని బెల్టు తీసి మీ వాళ్ళందరి ముందు ఏ గౌరవం లేకుండా, నేను చులకనయిపోతానన్న ఇంగితం పూర్తిగా మర్చిపోయి గొడ్డును బాదినట్టు బాదుతుంటే ఎవరూ అడ్డం రాలేదు.

మీమీద ప్రతీకారంతోనే రాంబాబుతో స్నేహం చేశాను. ఎటూ అనుమాన పడుతున్నారు కాబట్టి నిజం చేయాలనిపించింది. మా స్నేహం వెళ్ళవలసిన దూరం వెళ్లింది. మా గురించి మీకు తెలియాలని ఎంతో ఆరాటపడ్డాను. శిక్ష వేయబడుతున్నట్లు మీకు తెలియాలి.

చివరకు ఈ రోజున....

హఠాత్తుగా ఇంటికి వచ్చిన మిమ్మల్ని చూడగానే రాంబాబు నా పక్కనే నాకులా ధైర్యంగా నిలబడతాడని అనుకున్నాను కాని నా మన్నాన నన్ను వదిలి వెళ్ళిపోతాడనుకోలేదు. ఉంటే బావుండేది. కుర్చీలో కూర్చుని నిశ్శబ్దంగా కొద్దిసేపు చూసి లేచి తలుపు మూసి గడి పెట్టారు. ఇహ నన్ను మీరేం చేసినా ఎవరూ రారు. ఆదుకోరు. అడ్డగించరు. ఎప్పటిలా బెల్టు తీశారు. రాంబాబుతో ఉండగా పట్టుబడ్డానని నాకెంతో సంతోషంగా ఉంది. ముఖం మీద నవ్వుతో గోడకానుకుని నిలబడ్డాను. చీరకూడా సరిగా కట్టుకోలేదు. బెల్టు కింద పడేసి కిటికీలో ఉన్న కత్తి అందుకుని నా దగ్గరగా వచ్చి కదలకుండా నా భుజం పట్టుకుని "ఏం పని ఇది" అడిగారు నవ్వుతూ. అదే నవ్వుతూ మీరు నాతో మొదటిసారిగా మాట్లాడటం. ఆ నవ్వులో నాకు కావలసిన బాధ ఉంది. నేను మీమీద తీర్చుకుంటున్న ప్రతీకారం గురించి ఏం చెప్పేది?

"చెప్పు."

తుపాను ముందుండే ప్రశాంతత. దేనికయినా సిద్ధంగా ఉన్నాను. చిన్నగా నవ్వి కళ్ళు మూసుకున్నాను. మీ చేయి నాభుజం మీద బిగుసుకు పోతోంది.

బాధతో కళ్ళు తెరిచే లోపల నా ఒంట్లోంచి రక్తం మీ ముఖం మీద చిమ్ముతోంది.

ఇప్పుడు చెప్పండి. నా రక్తం వేడిగా ఉందా, చల్లగా ఉందా?

◆ ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 5 ఏప్రిల్ 1967